

(గత సంచిక తరువాయి)

21

కారు హైవే మీద మెత్తగా జారిపోతోంది. అతను డ్రైవింగ్ విషయంలో మంచి ఎక్స్పర్ట్. చాలా నైపుణ్యం తో నడిపిస్తున్నాడు కారుని.

ఇంతకు ముందూ ఇలాగే ఈ కారులో అతని పక్కన కూర్చుని గుడివాడ మొత్తం తిరిగింది. అప్పుడు అతను వేరు. అప్పుడు ప్రియుడు. తనకోసం పడి చచ్చిన ప్రేమికుడు. ఇప్పుడు తాళి కట్టిన మొగుడు. అప్పుడు డ్రైవ్ చేసినంత సేపూ చిలిపిమాటలు, అల్లరి చేతలతో తనకి ఊపిరాడకుండా చేసేవాడు. కానీ ఇప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు.

ఒక్క తాళితో తన మీద ఇతనికి సర్వాధికారాలు ఎవరిచ్చారు?

అమ్మానాన్న ఇచ్చారా? సంప్రదాయాలు ఇచ్చాయా? సమాజం ఇచ్చిందా? అతనే తీసుకున్నాడా?

అమ్మ ఒక్కమాట అన్నా, నాన్న తను కోరింది చేయకపోయినా, ఇల్లంతా చిందులేసి, రచ్చ చేసే తను ఇలా ఎలా మారిపోయింది? ఇతను తన మీద చేయి చేసుకున్నా ఎలా ఊరుకుంది? తనని భయపెడుతుంటే ఎందుకు భయపడుతోంది? తనలో అకస్మాత్తుగా ఇంత సహనం ఎలా వచ్చింది?

ఈ మార్పులన్నీ ఆడపిల్లల్లో ఈ తాళి కలిగిస్తుందా?

గుండెల మీద ఉన్న తాళి బొట్టు బరువుగా అనిపించింది.

ఇది తీసి రోడ్డు మీదకి విసిరేస్తే, తనలో ఈ భయం, ఈ పిరికితనం పోతాయా? తను కోల్పోయిన స్వేచ్ఛ తిరిగి లభిస్తుందా?

పవిత్ర ఆపాదమస్తకం వణికింది. ఏంటి ఇలా ఆలోచిస్తోంది తను ఏమైంది?

లేదు. శివని మార్చుకోవాలి. తన శివని పూర్తిగా తన వాడిగా చేసుకోవాలి. తన ప్రేమ నిజమని ఋజువు చేసుకోవాలి అంటే తానిలా ఆలోచించకూడదు. శివ తన భర్త. భర్తకి తనని మందలించే అధికారం ఉంటుంది.

పవిత్రకి వర్ధని, మాధవల మధ్య అప్పుడప్పుడు జరిగే వాదనలు, కలహాలు గుర్తొచ్చాయి. నాన్న ఎన్నో సార్లు అమ్మని నోర్ముయ్ అని తిట్టడం తను విన్నది. ఆరోజు ఆ విషయం పట్టించుకోలేదు. ఏదో అమ్మానాన్నల గొడవ నాకెందుకు అనుకుంది.

ఇప్పుడు తను, శివ పుట్టబోయే బిడ్డలకి అమ్మానాన్న కాబోతున్నారు.

అప్రయత్నంగా ఆమే చేయి పొట్ట మీదకి వెళ్ళింది. ఒళ్ళంతా పులకించింది. తను అమ్మ కాబోతోంది. శివ నాన్న అవుతాడు. తను ఈ శుభవార్త చెప్పగానే అతను స్పందించిన తీరు గుర్తొచ్చి మళ్ళీ భయంతో ఒళ్లంతా జలదరించింది.

లేదు... తాగిన మైకంలో ఏదో అన్నాడు. తన మీద శివకి నమ్మకం లేక అనలేదు. తనే తొందర పడింది. శివకి మాత్రం నాన్న అవుతున్నాను అన్న ఆనందం ఉండదా? ఉంటుంది. కచ్చితంగా ఉంటుంది. ఇంటికి వెళ్ళాక కోపం మర్చిపోయి తనని ప్రేమగా దగ్గరకు తీసుకుంటాడు. సారీ చెప్తాడు అనుకుంది.

తలతిప్పి అతని వైపు చూసింది. అతను రోడ్డు మీద దృష్టి కేంద్రీకరించి కారు నడుపుతున్నాడు.

ఏకాగ్రత అంతా ఇప్పుడు డ్రైవింగ్ మీద ఉంది. అందుకే మాట్లాడడం లేదు. ఇంటికి వెళ్ళాక ఎప్పటిలా ఉంటాడు. నమ్మకంగా అనుకుంది. కానీ అంతరాంతరాల్లో ఏదో భయం వానపాములా పాకుతూనే ఉంది.

తను చెప్పకుండా వచ్చేసినందుకు ఈ పాటికి ఎంత కోపంతో మండిపడతాడో అని వణికిపోతూనే కారెక్కింది. కానీ, అతని ధోరణి విరుద్ధంగా ఉంది.

చేసిన హెచ్చరిక చాలు అనుకున్నాడా? ఆ హెచ్చరికలతో తను చచ్చినట్టు పడి ఉంటుందని ధైర్యంగా ఉన్నాడా? ఆ ఆలోచనతో వానపాము నాగుపాము అయినట్టు అనిపించింది.

మనసంతా గందరగోళంగా ఉంది. అతని మీద ప్రేమ అతని గురించి చెడ్డగా ఆలోచించద్దు అని హెచ్చరిస్తున్నా, అతని కళ్ళల్లో కనిపించిన క్రూరత్వం గుర్తొస్తే మాత్రం గజగజ వణుకుతోంది. ఎటూ నిశ్చయించుకోలేని సందిగ్ధావస్థలో అనేక ఆలోచనలు ఆమె మెదడులో అలజడి సృష్టిస్తున్నాయి.

ముప్పై రోజుల తరవాత తిరిగి అతనితో కారులో దూర ప్రయాణం చేస్తుంటే, మనసు కొంచెం ఆనందంతో తుళ్లిపడింది. దారిలో జరిగిన సంఘటన పట్ల పరస్పరం క్షమార్పణ చెప్పుకుని కలిసిపోతారని, సరదాగా మాట్లాడుకుంటూ ప్రయాణం చేస్తారని ఎక్కడో తీయని ఆలోచన కలిగింది కారెక్కుతున్నప్పుడు. కానీ, గుడివాడలో బయలుదేరిన కారు మధ్యలో ఒకసారి భోజనానికి, రెండుసార్లు కాఫీకి ఆపాడు. డ్రైవ్ చేస్తున్నంత సేపు రెండు, మూడు మాటలు తప్ప ఏమి మాట్లాడలేదు. పవిత్రకి ఎన్నో ప్రశ్నలు వేయాలని ఉంది. సరళ ఎవరు? ఆమెకి, నీకూ ఉన్న సంబంధం ఏమిటి? నిజం చెప్తావా లేదా? అని నిలదీయాలని ఉంది. నేనేం తప్పు చేసాను, నా మీద ఎందుకింత కోపం? అని బతిమాలాలని కూడా ఉంది. కానీ ఏది చేయడానికి ధైర్యం సరిపోడం లేదు.

అతనేదన్నా మాట్లాడతాడని, "నాకూ సరళకీ నువ్వనుకునే సంబంధం లేదు, నన్ను అపార్థం చేసుకున్నావు అని కోపం వచ్చింది... నన్ను క్షమించు పవిత్రా" అంటాడని ఆశించింది. కనీసం ఎందుకు వెళ్లావు నాకు చెప్పకుండా? ఏం చేయాలని అనుకున్నావు అని ప్రశ్నిస్తాడేమో అని కూడా అనిపించింది...

అయితే, అదేమీ జరగలేదు. ఆశ్చర్యకరంగా అతనా ప్రస్తావన తీసుకురాలేదు. ఏమి జరగనట్టు, పుట్టింటికి వెళ్ళిన భార్యని తిరిగి తీసుకుని వెళ్తున్న భర్తలాగే ప్రవర్తిస్తోంటే ఒక విధంగా భయం కూడా వేస్తోంది. రాబోయే ప్రళయానికి ఇది నాంది అనిపిస్తోంది. ఏదన్నా మాట్లాడితే బాగుండు అనిపిస్తోంది.

ముందు, ముందు ప్రళయం వస్తుందా? ప్రణయ భావన చిగురిస్తుందా? ఆవిడ ఎక్కడ ఉందో! వాళ్ళింటికి వెళ్లిందో, తనింట్లోనే ఉందో! ఆమెకి ఏం చెప్పి వచ్చాడో ఇతను గుడివాడకి. ఇప్పుడు ఇంటికి వెళ్ళగానే వెకిలిగా నవ్వుతూ ఎదురువస్తుందా? పవిత్రకి జుగుప్సతో ఒళ్ళు జలదరించింది.

విచిత్రం! అమ్మా, నాన్న దగ్గర ఎంత నటించాడు! తన కన్నీళ్లు చూసి కంగారు పడిన అమ్మ అతని నటన చూసి ఎలా నమ్మింది? అమ్మకి కూడా అతనిది నటన అనిపించలేదా?

భర్త పట్ల తనలో ఎంత స్వార్థం ఉన్నా, తల్లి లాంటి పిన్నితో అక్రమ సంబంధం అంటకట్టేంత నీచురాలు కాదే! అమ్మ ఎలా నమ్మింది! నాన్న ఎలా నమ్మాడు? నానమ్మ నమ్మింది అంటే అర్థం ఉంది. ఆవిడకి శివ అంటే మొదటి నుంచీ అభిమానమే.

అతను తన మీద అలిగింది అంటే, ఎందుకు అలిగింది? నువ్వేం అన్నావు? ఏం చేసావు? అని ఎవరూ అతన్ని ఎందుకు అడగలేదు? అల్లుడు అనగానే అతనికి అంత గౌరవం ఇస్తారా? అల్లుడన్న గౌరవమా? డాక్టర్ కాబట్టి అతని హోదాకి ఇచ్చిన గౌరవమా? డాక్టర్ అయినంత మాత్రాన అతను చెప్పిందే నిజం, తను చెప్పేది అబద్ధమా? ఇలాంటి విషయాల్లో అబద్ధం ఎందుకు చెప్తుంది అని అమ్మ కూడా ఆలోచించలేదా?

తన ఏడుపు చూసి అంత ఆవేశ పడిన నాన్న ఇతన్ని చూడగానే ఎందుకంత శాంతంగా అయ్యారు? తన మీద కన్నా అల్లుడి మీదే నమ్మకమా? కారణం తను చిన్నది, ఎక్కువగా చదువుకోలేదు... తనకి లోకజ్ఞానం లేదు... అన్న వాళ్ళ అభిప్రాయం. లోక జ్ఞానం లేకపోయినా, మంచికీ, చెడుకీ తేడా తెలియని అవివేకి కాదే!

పవిత్ర ఆలోచనలు సాగిపోతున్నాయి. ఇతను దుర్మార్గుడా? మంచివాడా? ఒకవేళ దుర్మార్గుడు అయితే, ఎలా ఈ దుర్మార్గుడి నుంచి తప్పించుకోవాలి?

ఈ కారులోంచి డోర్ తీసుకుని దూకేస్తే! లేదు, లేదు అలా చేయలేదు. ఇంత వేగంగా వెళ్తున్న కారులో నుంచి దూకేస్తే ప్రాణాలకే ప్రమాదం వస్తుంది. తనకి చచ్చిపోవాలని లేదు... బతకాలి. ఇతని నిజ స్వరూపం అమ్మా నాన్నలకి తెలియచేయడానికి అయినా బతకాలి. ఇలాంటి వాడితో భర్తే దైవం అనుకుంటూ బతికే పాతకాలం అమ్మాయి కాదు తను. తనది నానమ్మ జనరేషన్ కాదు... పవిత్ర ఆలోచిస్తూనే ఉంది. కారు హైదరాబాద్ చేరింది.

మరి కొద్దిసేపట్లో అతని గుహలోకి వెళ్ళబోతోంది. మొత్తం ప్రయాణంలో అతను ఏమి మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది... కొంత జంకూ కలుగుతోంది.

ఈ ఆందోళన కి అంతటికీ ఇంట్లో అడుగుపెడుతూనే ఒక ముగింపు వస్తే బాగుండు... ఈ కలహం ప్రణయ కలహంగా మారిపోయి, ఇద్దరూ ఒకటైతే, పులకించింది. చెంపల మీదకి వెచ్చని ఆవిరి వచ్చింది. ఎంతైనా శివ నా భర్త. నా మీద ప్రేమతోటే ఇలా ఉన్నాడు. అవును తను ప్రేమించిన భార్య మీద తనకి హక్కులుంటాయిగా. విండో లోంచి, బయటకి చూసింది. ప్రకృతి చీకటి, వెలుగుల సయ్యాట ఆడుతోంది. నా జీవితంలాగే ఉంది అనుకుంది.

సంధ్యాసమయం ఆకాశం కెంజాయ రంగులో ఎంత అందంగా ఉంటుంది! ఈ రోజెందుకు ఇలా సెగలు, పొగలు కక్కుతున్నట్టు ఉంది. ఎన్నో సార్లు కదిలే బూడిద రంగు మబ్బులతో పరిగెత్తుతూ ఆడుకుంది చిన్నప్పుడు. కదిలే మేఘాలు, మెరిసే నక్షత్రాలు, బంతిలాంటి చంద్రుడు తన నేస్తాలే. ఈరోజెందుకో శత్రువుల్లా అనిపిస్తున్నాయి.

నక్షత్రాలను కురులలో తురుముకుని చంద్రుడి కోసం ఎదురుచూసే ఆకాశం ఎందుకో విషాదంగా ఉన్నట్టు అనిపిస్తోంది. తనని శివ మోసం చేసినట్టు చంద్రుడు మబ్బులను, తారలను మోసం చేస్తున్నాడా?

లేదు, లేదు శివ మోసం చేయడు. అసలు తను లేకుండా బతకలేడు. అందుకేగా పరిగెత్తుకుని వచ్చి తీసుకుని వెళ్తున్నాడు. ఇదంతా భ్రమా! శివ నిజంగానే దుర్మార్గుడేమో! చిత్ర,విచిత్రంగా సాగుతున్న తన ఆలోచనలకి ఆమెకి నవ్వొచ్చింది. కానీ ఆ నవ్వులో వెలుగు లేదు. సహజంగా పరిమళించే విరులూ లేవు.

రోడ్ల మీద వాహనాల వెలుగులు ప్రసరిస్తున్నాయి. అక్కడక్కడా కొన్ని షాపుల్లో లైట్లు వెలుగుతున్నాయి. చలికాలం కావడం మూలంగా త్వరగా మూసేశారు కొందరు వ్యాపారస్తులు.

చాలా జాగ్రత్తగా డ్రైవ్ చేస్తూ వచ్చి ఇంటి ముందు ఆపాడు శివ కారుని. పవిత్ర నిశ్శబ్దంగా దిగి, నాలుగు మెట్లు ఎక్కి తలుపు పక్కన నిలబడింది.

అతను కారు పార్క్ చేసి వచ్చి, జేబులో నుంచి తాళం చెవి తీసి, తాళం తీసాడు. తలుపులు తెరవగానే గబుక్కున లోపలికి వెళ్ళింది పవిత్ర.

ఇంట్లో ఎవరూ లేరు. పవిత్ర ఊపిరి పీల్చుకుంది. ఆమె వెనకే వచ్చిన శివ తలుపు మూసి గడియ వేసాడు.

బాత్ రూమ్ వైపు వెళ్ళబోతున్న పవిత్ర ఉలిక్కిపడింది. చిన్నగా అరుస్తూ వెనక్కి తిరిగింది. ఆమె జడ పట్టుకుని తన మణికట్టు చుట్టూ ఒక తిప్పు తిప్పి గట్టిగా లాగాడు. మెడ నరాల దగ్గర నుంచి భయంకరమైన నెప్పి. ఆ నెప్పికి ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆమెని తనకి సమీపంగా లాగి, జడ విసురుగా వదిలేసి, అంతే విసురుగా ఆమె చెంప చెళ్ళుమనిపించాడు. ఆమె కళ్ళ ముందు మెరుపులు మెరిసాయి. చెంప పగిలి నెత్తురు చిమ్మినట్టు మంట చెలరేగింది.

"నీకెంత ధైర్యం? నేను ఇంట్లో లేనప్పుడు, నా అనుమతి లేకుండా గడప దాటి, ఊరు దాటి మీ ఊరు వెళ్తావా? ఎందుకే? నా మీద నేరాలు చెప్పడానికేగా? చెప్పావా? అంతా చెప్పేసావా? ఏమని చెప్పావు? నా మొగుడు స్వంత పిన్నితో

ఒకే మంచం మీద పడుకుంటున్నాడు... నాకు అన్యాయం చేస్తున్నాడు వాడికి బుద్ధి చెప్పండి అని అడగడానికా? ఏమన్నారు? నమ్మేసారా? ఒసేయ్ పిచ్చిదానా! ఈ భూమ్మీద మెడ మీద తలకాయ ఉన్నవాడు ఎవడూ పిన్నితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు నా మొగుడు అని చెప్తే నమ్మేయడు. అనుమానం పీనుగా అని నిన్నే తిడతారు. అర్థం అయిందా? ఇంకోసారి నా అనుమతి లేకుండా ఈ గడప దాటావో..." కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ చూపుడు వేలు ఆమె కళ్ళ ముందు ఆడిస్తూ "ఖబడ్దార్" అన్నాడు.

మహాసముద్రానికి ఉప్పెన వచ్చింది. పవిత్ర హృదయం అనే సముద్రానికి సునామీ వచ్చింది. పరిగెత్తుకుంటూ గదిలోకి వెళ్లి తలుపు గడియ వేసుకుని, మంచం మీద వాలిపోయి వెక్కి, వెక్కి ఏడవసాగింది. ఆ సునామీలో ఆమె కన్న కలలు, శివ మీద పెంచుకున్న అనురాగం, ప్రేమ, నమ్మకం అన్నీ కొట్టుకుపోసాగాయి.

దుర్మార్గుడే కాదు, కసాయి వాడు. ఎంత నీచుడు కాకపోతే ఇంత త్వరగా తన విశ్వరూపం ప్రదర్శిస్తాడు. అతనికి తోటి మనుషుల పట్ల గౌరవం లేదు. తెగించిన వాడు. ఇతని దుర్మార్గాన్ని భరించాల్సిందేనా? జీవితాంతం తానీ చెరసాలలో బందీగా, అతని బానిసగా బతకాల్సిందేనా? తనని రక్షించేవాళ్ళే లేరా? నానమ్మా! బావురుమంది పవిత్ర.

"ఏయ్ తలుపు తీయి... నువ్వు అంత:పురంలో శయనిస్తే ఇక్కడ నీ తాతలు ఎవరూ లేరు వండి వార్చడానికి. లే... తలుపు తీయ్". కర్కశంగా అతని స్వరం, తలుపు మీద బాదుతున్న శబ్దం...

ఉలిక్కిపడి లేచి మంచం మీద కూర్చుని, తలుపు వేపే చూస్తూ కూర్చుంది. తరవాత నెమ్మదిగా మంచం దిగి, చీర చెంగుతో కళ్ళు , మొహము తుడుచుకుంది. అడుగులో అడుగు వేస్తూ గుమ్మం వైపు నడిచింది. చాలా నింపాదిగా బోల్టు తీసింది.

"ఏం చేస్తున్నావు లోపల?" గద్దించి అడిగాడు. ఆమె సమాధానం చెప్పలేదు.

"వెధవ్వేషాలు వేయకు. నీ ఏడుపు చూసి జాలిపడి కన్నీళ్లు తుడిచేవాళ్ళు ఎవరూ లేరు. ఆ ఏడుపు మొహం తీసేసి, నవ్వుతూ నీ పనులు నువ్వు చేయి. వెళ్లి కాఫీ పెట్టు". అథార్టీగా అన్నాడు.

ఆమె సమాధానం చెప్పకుండా వంట గదిలోకి నడిచింది. చైతన్య రహితంగా నడిచి వెళ్తున్న ఆమెని చూస్తూ క్రూరంగా నవ్వుకున్నాడు శివ.

షర్టు బటన్స్ విప్పుతూ గదిలోకి వెళ్ళాడు. అద్దం ముందు నిలబడి తనని తాను చూసుకుని, వికటంగా నవ్వుకున్నాడు.

"డాక్టర్ శివరామకృష్ణ , ఎం.బి.బి.ఎస్. ఎంత గొప్పగా నటించావురా! అందం, అమాయకత్వం, ఆస్తి అన్నీ ఉన్న అమ్మాయిని వలలో వేసుకోడం ఇంత సులభమని తెలిసి ఉంటే ఇంకో ఇద్దరిని ట్రాప్ చేసేవాడిని కదా! ఒక కాంపౌండర్, డాక్టర్ గా అవతారం ఎత్తి, ఏడాదిపాటు ఊర్లో ఎందరినో నమ్మించి, డాక్టర్ శివరామకృష్ణ అనే బోర్డు శాశ్వతంగా తగిలించుకోవడం అనేది ఎంత గొప్ప విషయం! ఇంత తెలివితేటలు, లౌక్యం ఎవరికి ఉంటాయి? నువ్వు గ్రేట్ రా..." తన భుజం తనే చరుచుకున్నాడు కాంపౌండర్ శివరామకృష్ణ.

ఇంక మంచితనం అనే ముసుగు దేనికి? నవ్వుకున్నాడు. ఇంక పవిత్రని నమ్మించడానికి రోజుకో వేషం వేయాల్సిన అవసరం లేదు అన్నట్టు, తన రంగు,రంగుల కుహనా మర్యాదల పొరలు ఒకొక్కటే తొలగిస్తున్నట్టు, ఒంటి మీద బట్టలు ఒకొక్కటే విప్పి, టవల్ కట్టుకున్నాడు.

ఇది మరోసారి ఈ గడప దాటి వెళ్ళకుండా మరింత కట్టడి చేయాలి. ఆమెకి ఇంట్లో సాయంగా ఉంటూనే ఆమె కదలికలు తనకి ప్రతి క్షణం చేరవేసే నమ్మకస్తురాలు అయిన పనిమనిషిని పెట్టాలి. మరోసారి తను ఈ ఇల్లు దాటింది అంటే, తన నిజస్వరూపం ప్రపంచానికి తెలిసిపోతుంది. ఆ తరవాత తనకి జైలు .... నొ అలా జరగనివ్వను. ధృడంగా అనుకున్నాడు.

ఇప్పుడు పవిత్ర తల్లి కాబోతోంది. కాబట్టి ఆమె తన నుంచి తప్పించుకుని వెళ్ళే అవకాశం ఎలాగా ఉండదు. పరువు, ప్రతిష్టలకు ప్రాధాన్యం ఇచ్చే మాధవరావు, కూతురు మొగుడిని వదిలేసి వస్తే ఆదరిస్తాడా? అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురుకి అంగరంగ వైభవంగా పెళ్లి చేయాల్సిన వాడు, తనతో ఆమె ప్రేమాయణం తెలిసిన వెంటనే ఆగమేఘాల మీద అతి నిరాడంబరంగా చేసాడు. అలాంటివాడు కూతురు మొగుడిని వదిలి వస్తే ఆదరించడం అనేది కలలో మాట. నా మొగుడు దుర్మార్గుడు నాన్నా... నేను కలిసి ఉండను అని ఆమె చెప్పినా, పవిత్రని తెలివితక్కువదానిగా ఎలా చిత్రించాలో తనకి తెలుసు. శివ విజయగర్వంతో స్నానానికి వెళ్ళిపోయాడు.

పవిత్ర ఆలోచిస్తూనే, అతనితో ఒక్కమాట కూడా మాట్లాడకుండా యాంత్రికంగా పని చేసుకుంటూ గడిపేసింది.

తను ఒక భయంకరమైన జీవితకాల ప్రమాదంలో చిక్కుకున్నాను అని మాత్రం అనిపించింది ఆమెకి. ఈ ప్రమాదం నుంచి ఎలా బయట పడాలో ప్రస్తుతం ఆలోచనకి అందడం లేదు. కానీ బయట పడాలి. శాశ్వతంగా.

మరి కొంత కాలం గడిచింది. పవిత్రకి మూడో నెల వచ్చింది. కూతురు వెళ్ళిన దగ్గర నుంచి యధాప్రకారం ఒక్క కబురు తెలియలేదు. వర్ధనికి మనసులో ఆందోళనగా ఉంది.

శివ అన్నట్టు పవిత్ర తెలివితక్కువ తనంతో అతనిని అనుమానించి రభస చేసిందా? లేక అతనే పవిత్రని, తన కుటుంబాన్ని మోసం చేసాడా? పెళ్లి కాకముందు నాంచారమ్మ గారికి జరిగిన ప్రమాదం సమయంలో ఎంత శ్రద్ధగా ఆవిడని చూడ్డానికి క్రమం తప్పకుండా వచ్చేవాడు! అతనే అందుబాటులో లేకుండా ఉండి ఉంటే ఆవిడ అంత త్వరగా కోలుకునేదా?

అతన్ని ఎంతో గాడంగా ప్రేమించి, అతన్నే పెళ్లి చేసుకుంటాను అని మొండిపట్టు పట్టిన పవిత్ర ఇంత త్వరగా అతను మోసగాడు అనే నిర్ణయానికి రావడంలో పవిత్ర అమాయకత్వం ఉందేమో! స్వంత పిన్నితో అతనికి అక్రమ సంబంధం ఎలా ఊహించగలిగింది! అది ఊహా? వాస్తవమా? కానీ అతని మొహంలో కానీ, అతని ప్రవర్తనలో కానీ, మాటల్లో కానీ ఏ మాత్రం చెడు కనిపించలేదు.

పెళ్లి అయి, అతనితో కాపురానికి వచ్చిన నెల రోజులకి సంతోషంగా పుట్టింటికి వచ్చి, నాలుగు రోజులు గడిపి, చీర, సారెతో వెళ్ళాల్సిన పిల్ల అంత హడావుడిగా వెళ్ళడం కూడా బాగాలేదు.

శివ దుర్మార్గుడు అయితే, భార్య అలిగి వచ్చిందని కంగారు పడుతూ, ఉన్నపాటున బయలుదేరి ఎందుకు వస్తాడు?

ఏదో జరుగుతోంది. పవిత్ర వెళ్లి నెల అవుతోంది. కనీసం ఒక ఉత్తరం ముక్క రాయలేదు. అయినా అంత పెద్ద డాక్టర్ ఇంట్లో ఫోన్ ఎందుకు పెట్టించలేదు? ఒక ఫోన్ చేయచ్చు కదా!

వర్ధనికి ఎటూ తోచడం లేదు. మాధవ కూడా పవిత్ర ఆ రోజు అంతగా ఏడ్చి ఎందుకు భయపడింది? అనే విషయం ప్రస్తావించలేదు. ఇవన్నీ కొత్తగా పెళ్లి కాపురం పెట్టిన, ప్రతి భార్యాభర్తల జీవితాల్లో సాధారణంగా వచ్చే కలహాలు అని తేలిగ్గా తీసుకున్నాడు. ఆయనకి శివ మీద చెడు అభిప్రాయం లేదు. అలాగని మంచి పవిత్ర చదువు మానేసి, అతని ఆకర్షణలో పడి, రైలు పట్టాల దగ్గరా, చెరువు కట్టల చుట్టూ విహరిస్తూ, తన పరువు తీస్తోందని మండిపడ్డాడు.

ఏది ఏమైనా, ఒకసారి హైదరాబాద్ వెళ్లి రావాలి.

అలా నిర్ణయించుకున్న వర్ధని అత్తగారితో అంది. “అత్తయ్యా! పవిత్రకి దొంగ చలిమిడి పెట్టాలి కదా! నేనూ, ఈయనా హైదరాబాద్ వెళ్లి రామా?”

"అవునే. నేనే గుర్తు చేద్దామనుకుంటున్నా. మీ ఇద్దరే ఎందుకు? నేనూ వస్తాను. ముగ్గురం వెళదాం. పిచ్చి పిల్ల మెరుపులా వచ్చి వెళ్ళింది. కళ్ళారా చూసినట్టు లేదు. అంతేలే పెళ్ళాం కనిపించక పోడంతో అతను కంగారు పడి వచ్చేసాడు. ఇంకా కొత్త మోజు తీరలేదుగా... విరహం తట్టుకోగలడా?" ముసిముసిగా నవ్వింది.

వర్ధని కూడా నవ్వి, "అయితే, మీ అబ్బాయి రాగానే మీరే అడగండి కారులో తీసుకుని వెళ్తారు" అంది.

"అడగడం ఏమిటి? ఆజ్ఞాపించడమే. నువ్వు ప్రయాణం ఏర్పాట్లు చేసుకో " డాంబికంగా అంది నాంచారమ్మ.

వర్ధని నవ్వుతూ బియ్యం నానపోయడానికి వెళ్ళిపోయింది.

మాధవ సాయంత్రం రాగానే అత్తాకోడళ్ళు కలిసి హైదరాబాద్ ప్రయాణం గురించి చెప్పారు.

మాధవకి కూడా కూతురుని చూడాలని అనిపించింది. "అలాగే వెళదాం. మీరే నిర్ణయించండి ఎప్పుడు వెళ్ళాలో " అన్నాడు.

"ఎప్పుడేంటి? రేపు ఉదయం బయలుదేరదాం" అంది నాంచారమ్మ.

"అలాగే" అంటూ అంగీకారం తెలిపాడు మాదావ.

మరి కొద్ది సేపటికి బెల్లం పాకం వాసన ఆ ఇంటి నిండా వ్యాపించింది.

తెల్లవారు జామున చిరు చీకట్లలో, హేమంతపు పరిమళాలు వెదజల్లుతున్న సమయంలో, రాత్రంతా చంద్రుడితో రాసకేళి జరిపి, అలసి, సొలసి మెరవడం మర్చిపోయిన తారల పవళింపుకి తాళం వేస్తున్న చల్లగాలి శబ్దం చేస్తుంటే, మాధవ డ్రైవ్ చేస్తున్న కారు గుడివాడ నుంచి హైదరాబాద్ కి బయలుదేరింది.

"ఇంటి అడ్రస్ తీసుకున్నారా అల్లుడి దగ్గర" అనడిగింది వర్ధని.

"లేదు. హడావుడిలో మర్చిపోయాను. హాస్పిటల్ కి వెళ్లి అడిగితే ఎవరో ఒకళ్ళు చెప్తారులే" అన్నాడు నమ్మకంగా.

వాళ్ళ ప్రయాణం ఉద్దేశం నెరవేరుతుందా? లేదా చూద్దాం అన్నట్టు మేఘాలు వాళ్ళ వెనకాలే మెల్లగా అనుసరించాయి.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS